నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 13 జూలై 2024 | VIKARABAD



# అనుక్షణం అప్రమత్తం



## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారుల చర్యలు

- వికారాబాద్ జిల్లావ్యాప్తంగా 26 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ఏర్పాటు
- ప్రభుత్వ వసతిగృహాలు, స్కూళ్లపై ప్రత్యేక దృష్టి
- నివారణపై ఊరూరా అవగాహన కార్యక్రమాలు

వికారాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : సీజనల్ వ్యాధులపై వికారాబాద్ జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. డెంగీ, మలేరియా, డయేరియా తదితర విష జ్వరాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. జిల్లా అంతటా యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్, మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయడం వంటి పనులు చేపడుతున్నారు. జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామ స్థాయి వరకు సీజనల్ వ్యాధుల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పరిశుభ్రత లోపించడం, కలుషితనీరు తాగడం వలన విషజ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున వ్యక్తిగత, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఎక్కడైనా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదైతే వెంటనే రంగంలోకి వారికి సరైన చికిత్స అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా జిల్లావ్యాప్తంగా రానున్న నెలరోజుల్లోపు ప్రసవమయ్యే గర్భిణుల వివరాలను సేకరించి.. వాగులతో రాకపోకలు స్తంభించే గ్రామాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

### 26 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలు..

డెంగీ కేసులు నమోదైన ప్రాంతాల్లో ఫీవర్ సర్వే నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫీవర్ కేసులు నమోదైన ఇంటికి చుట్టుపక్క 50 ఇండ్ల వరకు సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. వైరల్ ఫీవర్, టైఫాయిడ్, డెంగీ లాంటి కేసులు నమోదైతే వెంటనే స్పందించేలా జిల్లావ్యాప్తంగా 26 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను జిల్లా వైద్యారోగ్య శాఖ నియమించింది. వ్యాధి లక్షణాలను ప్రారంభంలోనే గుర్తించి చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాస్థాయిలో ఒక టీం పనిచేయనుండగా, మిగతావి ప్రతి పీహెచ్‌సీకి ఒకటి చొప్పున అందుబాటులో ఉండనున్నది. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఏరియా, సీహెచ్‌సీ, జిల్లా ఆసుపత్రుల్లో ప్రత్యేక బెడ్లను సిద్ధం చేశారు. ఫీవర్ సర్వేలో భాగంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి జ్వరం, జలుబు, తలనొప్పి తదితర లక్షణాల వివరాలను సేకరిస్తున్నారు. ఆయా వ్యాధి లక్షణాలను బట్టి నేరుగా ఇంటి వద్దనే ఉచితంగా మందులను అందిస్తున్నారు. మూడు, నాలుగు రోజులు మందులు వాడినా జ్వరం, జలుబు, తలనొప్పి తగ్గని వ్యక్తుల రక్త నమూనాలను సేకరించి వైద్య పరీక్షలకు పంపుతున్నారు. ఒకవేళ డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ అయినట్లైతే ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. అన్ని ఆసుపత్రుల్లోనూ చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచేలా జిల్లా వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. డయేరియాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడంతోపాటు ఓఆర్‌ఎస్, జింక్ ట్యాబ్లెట్లను అందిస్తున్నారు.

### విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి...

జిల్లాలోని ప్రభుత్వ వసతిగృహాలు, స్కూళ్ల విద్యార్థులు అనారోగ్యానికి గురికాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల వికారాబాద్, పరిగి ప్రభుత్వ వసతిగృహాల్లోని విద్యార్థులు అస్వస్థతకు గురైన దృష్ట్యా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. హాస్టళ్లలో పనిచేసే నాన్-టీచింగ్ సిబ్బందితోనే ఎక్కువగా వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున వంట మనుషులు, పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఫీవర్ ఉన్న వారిని తగ్గే వరకు ప్రత్యేక గదుల్లో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 81 హాస్టళ్లలో ఇప్పటివరకు 481 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి తగు చికిత్స అందిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



### సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు...

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యారోగ్య శాఖ సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు అవసరమైన చర్యలు చేపట్టాం. డెంగీ కేసులు నమోదైతే సంబంధిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వేను కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. ఏరియా, సీహెచ్‌సీ, జిల్లా దవాఖానల్లో ప్రత్యేకంగా ఐదు బెడ్లను సిద్ధంగా ఉంచాం. ఇండ్లు, స్కూళ్లు, హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి వడపోచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ పల్వన్‌కుమార్, డీఎంహెచ్‌వో



నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోని గోపనపల్లి ఫ్లై ఓవర్

# ఆ ఫ్లై ఓవర్‌ను ఎందుకు ప్రారంభించరు?



బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 12 (నమస్తే తెలంగాణ): తమ ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసిన గోపనపల్లి ఫ్లైఓవర్‌ను ఎందుకు ప్రారంభించడం లేదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గోపనపల్లి ఫ్లైఓవర్ అందుబాటులోకి వస్తే నల్లగండ్ల, గోపన్‌పల్లి, తెల్లాపూర్, చందానగర్‌వాసులకు ట్రాఫిక్ కష్టాలు తగ్గుతాయనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వేగంగా ఆ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేసిందన్నారు. ఆ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించకుండా సర్కారు ప్రజలను ఇబ్బంది పెడుతున్నదని ఆయన ఎక్స్‌వేదిక ద్వారా ధ్వజమెత్తారు. ప్రజల సమస్యలపై అవగాహన లేని అసమర్థ ప్రభుత్వం, నాయకత్వం ఉంటే ఇలాంటి పరిస్థితి వస్తుందని విమర్శించారు. ఢిల్లీకి షటిల్ సర్వీసులు కొట్టడానికి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరగటానికి సీఎం రేవంత్‌రెడ్డికి సమయం ఉంది కానీ, ఆ ఫ్లైఓవర్‌ను ప్రారంభించేందుకు సమయం లేకుండా పోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు ప్రజల సమస్యల కన్నా వ్యక్తిగత ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. ప్రజల ప్రయోజనాల దృష్ట్యా వెంటనే ఆ ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలే ఆ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

# 18 మంది విద్యార్థులకు అస్వస్థత

- కందనెల్లితండా ప్రాథమిక పాఠశాలలో ఫుడ్‌పాయిజన్
- తాండూరులోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో విద్యార్థులకు చికిత్స
- వరుస సంఘటనలతో ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు



చికిత్స పొందుతున్న అస్వస్థతకు గురైన విద్యార్థులు

పెద్దేముల్, జూలై 12 : వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు వరుసగా చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా శుక్రవారం పెద్దేముల్ మండల పరిధిలోని కందనెల్లితండా ప్రాథమిక పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో సుమారు 18 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం మధ్యాహ్న భోజనంలో భాగంగా ఏజెన్సీవారు విద్యార్థులకు పులిహోరను వడ్డించారు. అది తిన్న కాసేపటికి 18 మంది విద్యార్థులు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర కడుపు నొప్పి, వాంతులు చేసుకుంటుండడంతో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం విద్యార్థులను తాండూరులోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. చికిత్స అనంతరం 14 మందికి విద్యార్థులు కోలుకోగా ఇంటికి పంపించారు. మరో నలుగురు విద్యార్థులను వైద్యులు అడ్మిట్ చేసుకొని చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి కూడా నిలకడగా ఉన్నదని వైద్యులు తెలిపారు. కాగా, జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

# రేపు 'లైఫ్ సేవ్ కిట్ల' పంపిణీ

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- లష్కర్‌గూడ గ్రామంలో సభ..
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రంగారెడ్డి, కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12 : గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండడానికి ప్రభుత్వం 'లైఫ్ సేవ్ కిట్ల' పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ లష్కర్‌గూడ గ్రామంలో రేపు జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ శశాంకతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ గీత కార్మికులకు ఏదో చేయాలనే తపనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారన్నారు. అందులో భాగంగానే ఆదివారం లష్కర్‌గూడలో గీత కార్మికులకు 'కాటమయ్య రక్షణ కవచం' కిట్లను పంపిణీ చేయనున్నారని తెలిపారు. సీఎం 2 గంటలపాటు ఇక్కడే ఉంటారన్నారు. కార్మికుల రక్షణ కోసం వచ్చిన నూతన టెక్నాలజీని వినియోగించుకోవాలని సూచించారు. సభా ఏర్పాట్లను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ప్రభుత్వం గీత కార్మికులకు రక్షణ కవచం కిట్లను అందజేయనుందని తెలిపారు. ప్రతి ఏడాది గీత కార్మికులు కల్లుగీస్తూ ప్రమాదావశాత్తు కిందపడి అంగవైకల్యం లేదా ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు. ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా ఉండడానికి కార్మికులకు ఈ కిట్లు ఎంతగానో దోహదపడుతాయన్నారు. గీత కార్మికులకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ, సూపరింటెండెంట్ ఉజ్వలరెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్తు, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ కరుణాకర్, వనస్థలిపురం ఏసీపీ కాశినాథ్‌రెడ్డి, సీఐ అంజిరెడ్డి, ఎక్సైజ్ సీఐ ధనవంత్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, స్థానిక నాయకులు, గౌడ సంఘాల నాయకులు, గీత కార్మికులు తదితరులు ఉన్నారు.



లష్కర్‌గూడలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ శశాంక

# కరెంట్ కోతలపై రోడ్డెక్కిన రైతన్నలు

కడ్తాల్ (తలకొండపల్లి), జూలై 12 : వ్యవసాయానికి కోతల్లేని కరెంట్ ఇవ్వాలని రాంపూర్ గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో వ్యవసాయానికి కరెంట్ సరఫరాలో జరుగుతున్న కోతలపై నిరసిస్తూ, శుక్రవారం చంద్రధన గ్రామంలోని ప్రధాన చౌరస్తాతోపాటు సబ్‌స్టేషన్ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అన్నదాతలు మాట్లాడుతూ గ్రామానికి కరెంట్ సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. గ్రామంలో 30 రోజులుగా అప్రకటిత కరెంట్ కోతలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయానికి కరెంట్ ఎప్పుడోస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియకుండా ఉందని మండిపడ్డారు. కరెంట్ సరఫరాపై సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సరైన సమాధానం ఇవ్వడంలేదని ఆరోపించారు. వెంటనే సంబంధింత శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో కరెంట్ సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కడ్తాల్: చంద్రధనలోని ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేస్తున్న రైతులు

# వికారాబాద్ అభివృద్ధికి రూ.3000 కోట్లు

- ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇందిరమ్మ ఇండ్లు
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు,జూలై 12; రాష్ట్రంలోనే వికారాబాద్ జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, రూ.3వేల కోట్లతో వికారాబాద్ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరు మండల పరిధిలోని కెరెళ్లి, ధారూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో చేపట్టనున్న మరుగుదోడ్ల నిర్మాణం, అల్లీపూర్, కుక్కింద-గడ్డమీది గంగారం గ్రామాల మధ్య బీటీరోడ్డు పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. అలాగే ధారూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికారాబాద్ అనంతగిరి అభివృద్ధికి రూ.500 కోట్లతో టూరిజం, ఉపాధి అవకాశాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.110 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధితో చేయడంతో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టుతో పాటు జుంటుపల్లి, సర్పన్‌పల్లి, నందిగామ ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.15వేలు ఇస్తామని గతంలో ప్రకటించిన విధంగా త్వరలోనే అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 10 ఎకరాలలోపు ఉన్న రైతులకు సాగుభూమికి ఇవ్వాలని రైతులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. దీనిపై సబ్ కమిటీ వేశామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడుతలో ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ధారూరు తహసీల్దార్ షాజీదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో నర్సింహులు, ఎంఈవో బాబుసింగ్, సత్యనారాయణ రెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రాములు, హన్మంత్ రెడ్డి, బాబాఖాన్, అనిల్‌కుమార్, యూనుస్, రాంరెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, విద్యార్థులు ఉన్నారు.

# పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- బడుల్లో మరమ్మతులను పరిశీలించిన కలెక్టర్ ప్రతీక్ జైన్
- బొంపల్లి, బాసుపల్లి, దోమ బాలుర, కేజీబీవీ పాఠశాలలు, దోమ పీహెచ్‌సీ సందర్శన
- దోమ మండల మహిళా సంఘాలతో సమీక్షా సమావేశం

దోమ,జులై 12; అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడుల్లో కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేసి సత్వరమే వాడుకలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. దోమ మండల పరిధిలోని బొంపల్లి, బాసుపల్లి, దోమ ఉన్నత, ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలను కలెక్టర్ సందర్శించి మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. పాఠశాలల్లో వంట గది, వాటర్ సంపు, టాయిలెట్స్, విద్యుత్తు తదితర మౌలిక వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాటర్ సప్లయ్ కనెక్షన్లు, మిషన్ భగీరథ నీటి సరఫరా వంటి వివరాలు సేకరించి గ్రౌండ్ రిపోర్టు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో అవసరమైన పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. బడుల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకోలాలని ఉపాధ్యాయులకు సూచించారు. దోమ ఉన్నత పాఠశాలలో శిథిలావస్థకు చేరిన భవనాన్ని పరిశీలించిన ఆయన వెంటనే తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

### పీహెచ్‌సీలో వసతులపై ఆరా..

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రతి రోజూ ఓపీ సేవలకు ఎంత మంది వస్తున్నారు.. ఎంత మంది స్టాఫ్ ఉన్నారు.. అంబులెన్స్ సౌకర్యం ఉందా.. లేదా అనే అంశాలను డాక్టర్ రజితను అడిగి తెలుసుకున్నారు. ఓపీ స్లిప్‌లు అట్టలపై రాసి ఇవ్వడంపై అసహనం వ్యక్తం చేశారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ మహిళలు తీసుకునే సబ్సిడీ లోన్స్ ద్వారా ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తున్నారని అడుగగా.. కుట్టు మిషన్లు, కోళ్ల ఫామ్‌లు, క్యాంటిన్లు, కిరాణా షాపులు పెట్టుకొని నడుపుతున్నట్లు వారు బదులిచ్చారు. ఐకేపీ ద్వారా జరిగే వరి ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దోమ కేజీబీవీని సందర్శించిన ఆయన వంట గది, టాయిలెట్స్ ,రన్నింగ్ వాటర్ సప్లయ్‌ని పరిశీలించి అతి త్వరలో మిషన్ భగీరథ వాటర్ సప్లయ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలికల అందరితో కలిసి సహపంక్తి భోజనం చేస్తూ తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి రేణుకాదేవి, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంఈవో హరిశ్చందర్, ఏవో ప్రభాకర్‌రావు, ఏపీఎం సురేశ్, ఏపీవో దస్తయ్య, డాక్టర్ రజిత, ప్రధానోపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



దోమ : బొంపల్లి పాఠశాలలో మౌలిక వసతుల పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రతీక్ జైన్